ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
గురువారం 27 జూన్ 2024



ఈకేవైసీ కోసం..



గ్యాస్ కార్యాలయం వద్ద బారులు తీరిన మహిళలు

- ఉచిత మూడు సిలిండర్లు రావని పుకార్లు
- వారం నుంచి గ్యాస్ కార్యాలయం వద్ద ఖాతాదారుల క్యూ

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 26: పట్టణంలోని ఇండేన్ గ్యాస్ కార్యాలయం వద్ద ఈకేవైసీ కోసం మహిళలు బారులు తీరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మూడు సిలిండర్లు ఈకేవైసీ లేకుంటే రావని పుకార్లు రావడంతో వారం రోజుల నుంచి మహిళలు భారీ సంఖ్యలో గ్యాస్ కార్యాలయం వద్ద బారులు తీరుతున్నారు. దీంతో గ్యాస్ కార్యాలయం వద్ద గందరగోళం పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఎప్పుడో ఆదేశాలు జారీ చేశారు. చాలా మంది తమ వివరాలను సరిచేసుకుని ఈకేవైసీ నమోదు చేసుకున్నారు. గత ప్రభుత్వంలో పథకాలు అందుకుంటున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేశారు. కానీ గ్యాస్ ఖాతాదారులు ఈకేవైసీని తప్పనిసరిగా వారి వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాలి. దీంతో మండలంలోని 21 పంచాయతీలకు చెందిన ఖాతాదారులు వారం రోజుల నుంచి గ్యాస్ కార్యాలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. దీనికి తోడు ఇప్పుడే ఈకేవైసీ చేసుకోవాలని లేని పక్షంలో ఉచితంగా సిలిండర్లు రావని కొంతమంది వైసీపీ కార్యకర్తలు పుకార్లు చేయడంతో ఖాతాదారులు గ్యాస్ కార్యాలయం వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని ఈ గందరగోళానికి తెరదించాలని ప్రజా సంఘాలు కోరుకుంటున్నారు.

వదంతులను నమ్మొద్దు

ఈకేవైసీ లేకుంటే గ్యాస్ రాదు అంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని కోడూరు రిషిక ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ తోట శివసాయి తెలిపారు. ఆగస్టు 30వ తేదీ వరకు ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపిందని పేర్కొన్నారు. గ్రామాలలో పుకార్లు రావడంతో భారీ స్థాయిలో మహిళా ఖాతాదారులు కార్యాలయానికి వస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఉన్న ఖాతాదారులకు తమ ఇంటి వద్దకే వచ్చి ఈకేవైసీ నమోదు చేస్తామని, పుకార్లు నమ్మి కార్యాలయం వద్దకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

చెరువులను చెరబట్టారు

- ఇష్టారాజ్యం.. అడిగే వారేరీ
- అక్రమంగా తవ్వేసిన వైసీపీ నాయకులు
- చోద్యం చూస్తున్న అధికారులు

వాల్మీకిపురం, జూన్ 26: అక్రమాలకు కాదేదీ అసాధ్యం.. అధికారం అండతో ఎటు చూసినా అక్రమాలే.. ప్రశ్నిస్తే దాడులు.. నిలదీస్తే దౌర్జన్యాలు వైసీపీ ప్రభుత్వ హయాంలో సహజ వనరులను కొందరు అక్రమార్కులు కొల్లగొట్టారు. చెరువులను చెరబట్టి మట్టిని అక్రమంగా తరలించి లక్షలాది రూపాయలు సంపాదించారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా చెరువులు పూర్తిగా రూపురేఖలను కోల్పోయాయి. మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా ఏ ఒక్క గ్రామంలో కూడా ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండాపోయింది. మండల వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా చెరువులలో తవ్వకాలు చేపట్టి చెరువుల రూపురేఖలను వైసీపీ నాయకులు మార్చేశారు. మండలంలోని చెరువుల్లో అనధికార తవ్వకాలతో వేలాది టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని స్వాహా చేసి సొమ్ము చేసుకున్నారు. మండలంలోని గంగాదొడ్డి, ఆరమడక, జమ్మాళ్లపల్లె, జర్రావారిపల్లె తదితర గ్రామాలలో చెరువులను పరిశీలిస్తే ఎంత దారుణంగా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడ్డారో అర్థమవుతుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూశారే తప్ప తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. వైసీపీ నాయకుల అండతో అక్రమార్కులు పేట్రేగిపోయి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. మండలంలోని కూరపర్తి గ్రామ సమీపాన బాహుదా కాలువను ఖాళీ చేసేశారు. ఒకవైపు ఇసుక, మరోవైపు మట్టి అక్రమ తవ్వకాలు సాగించి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డుగోలుగా దోచేశారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా పట్ల ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులకు ఈ దృశ్యాలు కనబడటం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల వ్యాప్తంగా చెరువులు, బాహుదా కాలువను బుగ్గిపాలు చేస్తున్న అక్రమార్కులపై ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గంగాదొడ్డి చెరువులో ఎక్స్‌కవేటర్‌తో అక్రమ తవ్వకాలు

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు..

వాల్మీకిపురం మండల వ్యాప్తంగా చెరువులు, బాహుదా కాలువలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు, చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు. అనుమతులు లేకుండా చెరువులలో తవ్వకాలు జరపకూడదు. ప్రభుత్వ భూములలో దౌర్జన్యాలు, అక్రమాలను సహించేది లేదు. మండలంలోని చెరువులలో అక్రమ తవ్వకాలపై తప్పక చర్యలు తీసుకుంటాం.

- ఖతిజున్‌కుబ్రా, తహసీల్దార్, వాల్మీకిపురం



అక్రమ తవ్వకాలతో బావిని తలపిస్తున్న ఆరమడక చెరువు



కూరపర్తి గ్రామం వద్ద తవ్వకాలతో బాహుదా కాలువలో ఏర్పడ్డ గోతులు

ఇంటి వద్దకే పెన్షన్లు

- ఈనెలలో జిల్లా పెన్షనర్లకు రూ.151.44 కోట్లు
- గత నెల ఇచ్చింది రూ.65 కోట్లే..
- మాట నిలుపుకున్న చంద్రబాబు
- అధికారంలోకి రాగానే పెంపు
- సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే పంపిణీ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని పెంచారు. దీంతో జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య అంతే ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం ఇస్తున్న మొత్తం కంటే.. ఒకటిన్నర రెట్లు పెరిగింది. సచివాలయ ఉద్యోగులతో జూలై ఒకటో తేదీన ఇంటి వద్దనే పెన్షన్లు ఇవ్వనున్నారు. దీనిపై వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇతర పెన్షన్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్షనర్లకు రూ.151.44 కోట్లు

ప్రస్తుతం జిల్లాలో అన్ని రకాల పెన్షన్లు కలిపి 2,23,436 మంది లబ్ధిదారులు ఉన్నారు. వృద్ధాప్య పెన్షన్లు, వితంతు, వికలాంగులు, అభయహస్తం, ఒంటరి మహిళ, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, సంప్రదాయంగా చెప్పులు కుట్టే కార్మికులు, పక్షవాత రోగులు, ప్రమాద బాధితులు, తీవ్ర నరాల సమస్యతో బాధ పడే రోగులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్స్, మత్స్యకారులు, డయాలసిస్ రోగులతో పాటు 26 రకాల లబ్ధిదారులకు ప్రభుత్వం పెన్షన్లను పంపిణీ చేస్తోంది. వీరందరికీ గత నెలలో వైసీపీ ప్రభుత్వం రూ.65 కోట్లు పంపిణీ చేసింది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వంలో వృద్ధాప్య పెన్షన్లు రూ.2 వేలు ఇచ్చేవాళ్లు. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారు. అయితే తాము అధికారంలోకి వస్తే.. పెన్షన్ పెంచుతామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్ నుంచి కలిపి గతంలో ఇస్తున్న రూ.3 వేలకు, అదనంగా వేయి రూపాయలు.. ఈనెల పెన్షన్ రూ.4 వేలు కలిపి ఒక్కో లబ్ధిదారునికి ఈనెల రూ.7 వేలు ఇవ్వనున్నారు. గతంలో నెలకు రూ.3 వేలు ఇచ్చే పెన్షన్ స్థానంలో రూ.4 వేలు ఇస్తున్నారు. వికలాంగులు, కుష్టురోగులకు రూ.3 వేలకు బదులుగా రూ.6 వేలు ఇస్తారు. పక్షవాతంతో వీల్‌ఛైర్‌కు పరిమితమైన రోగులు, తీవ్ర ప్రమాదబాధితులు, తీవ్ర కండరాల బలహీనత రోగులకు గతంలో ఇచ్చే రూ.5 వేలకు బదులుగా రూ.15 వేలు ఇవ్వనున్నారు. గతంలో రూ.5 వేలు పెన్షన్ ఇస్తున్న లబ్ధిదారులకు రూ.10 వేలు ఇస్తారు. గతంలో రూ.10 వేలు ఇచ్చే లబ్ధిదారులకు ఎటువంటి మార్పు లేకుండా అంతే ఇస్తారు. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం చేయనున్న పంపిణీ ప్రకారం.. జిల్లాలో వృద్ధాప్య పెన్షన్లు 1,29,050 మంది ఉన్నారు. వితంతు పెన్షన్లు 46,219 మంది, వికలాంగులు 26,849, అభయహస్తం 5698, ఒంటరిమహిళలు 4449 మంది ఉన్నారు. స్వల్ప కిడ్నీ బాధిత లబ్ధిదారులు ముగ్గురు ఉన్నారు. మొత్తం 26 రకాల పెన్షన్ లబ్ధిదారులకు చంద్రబాబు ప్రభుత్వం వల్ల లబ్ధి చేకూరనుంది.

సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దకే పంపిణీ

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పథకాలలో భాగంగా పెన్షన్లను వార్డు/గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పెన్షన్లు పంపిణీ చేసేది. అయితే ఎన్నికలకు ముందు వలంటీర్లను ప్రైవేటు సైన్యంలా వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకోవడంతో కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. ఎన్నికలు ముగిసే వరకు సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల ప్రమేయం ఉండకూడదని ఆంక్షలు విధించింది. అయితే ఇదంతా తెలుగుదేశం పార్టీ చేసిందని, వలంటీర్లు లేకుంటే లబ్ధిదారులకు పెన్షన్లు ఇవ్వలేమని వైసీపీ నాయకులు నానా హంగామా చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్లు పంపిణీ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను చూడలేదు. వలంటీర్లు లేకుంటే.. పెన్షన్లు పంపిణీ చేయలేమనే అభిప్రాయం కలిగించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. అయితే సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకుని లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పెన్షన్లను పంపిణీ చేయమని తెలుగుదేశం పార్టీ జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఈ నేపథ్యంలో జూన్ నెలలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం దూరంగా పెట్టింది. సచివాలయ సిబ్బందితో పాటు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకుని జూలై ఒకటో తేదీ ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రతి ఉద్యోగి 50 పెన్షన్లకు మించకుండా.. పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని, ఆదేశించింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి పెన్షన్ మొత్తాన్ని పెంచడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- జిల్లాలో 46 శాతం ఉత్తీర్ణత

రాయచోటి టౌన్, జూన్ 26: ఇంటర్మీడియట్ విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో విద్యార్థులు 46 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య తెలిపారు. జిల్లాలోని 119 జూనియర్ కళాశాలల నుంచి 5371 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 2479 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జిల్లాలోని ఎయిడెడ్, ప్రైవేటు, కస్తూర్బాగాంధీ, ఏపీ మోడల్ స్కూల్స్, హైస్కూల్ ప్లస్, గురుకుల పాఠశాలలు తదితర కళాశాలల నుంచి పరీక్ష తప్పిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షకు హాజరై 46 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో జిల్లా మూడో స్థానం నిలిచిందని ఆయన తెలియజేశారు.

'పది' సప్లిమెంటరీ ఫలితాల్లో 81.28 శాతం ఉత్తీర్ణత

రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం విడుదల చేసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో జిల్లాలో విద్యార్థులు 81.28 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 23 పరీక్షా కేంద్రాల్లో 3275 మంది పరీక్షకు హాజరు కాగా అందులో 2662 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

డయేరియాతో 25 మందికి అస్వస్థత

- ఆస్పత్రిలో చేరి చికిత్స

వాల్మీకిపురం, జూన్ 26: వాల్మీకిపురం పట్టణ పరిసర ప్రాంతాలలో డయేరియా (అతిసార) బారిన పడ్డ బాధితులు బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. పట్టణానికి చెందిన తహీర్, ఉత్తమ్మ, లక్ష్మీదేవి, నరసింహులు, సాయినాథ్, మురాద్‌బీ, సాతిమాబీ, షహీర్‌బాషాలతో పాటు మరో 20 మంది తీవ్ర వాంతులు, విరేచనాలతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వాస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులలో చేరి చికిత్సలు పొందుతున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం మాట్లాడుతూ కలుషిత ఆహారం, నిల్వ ఉంచిన నీటి ద్వారా కూడా డయేరియా బారిన పడుతుంటారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, దోమలు నివారించడం ద్వారా వ్యాధులను అరికట్ట వచ్చునన్నారు. రెండు రోజులుగా డయేరియా కేసులు పెరిగాయని బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.



వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలోని వార్డులో డయేరియా బాధితులు

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

- జిల్లావ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీలు

రాయచోటి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం, భవిష్యత్తును అంధకారం చేస్తుందని పోలీసు అధికారులు తెలిపారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ర్యాలీలు, మానవహారాలు చేశారు. రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినయ్‌బాబు మాట్లాడుతూ మత్తుపదార్థాల వలన ఆరోగ్యపరంగా, సామాజికపరంగా, కుటుంబపరంగా ఆర్థికంగా జరిగే కష్టనష్టాల గురించి వివరించారు. దేశ భవష్యత్తుకు పునాది, భావి భారత పౌరులైన యువత మత్తు పదార్థాలైన గంజాయి, కొకైన్, హెరాయిన్, ఆల్కహాల్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ హిమబిందు, ఎస్‌ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పీలేరులో ఎస్‌ఈబీ అధికారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి డీఎస్పీ శ్రీధర్, పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డిలు విద్యార్థులతో కలిసి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ములకలచెరువులో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఐ మధు, ఎస్‌ఈబీ సీఐ రామ్మోహన్, ఎస్‌ఐ తిప్పేస్వామి ఆధ్వర్యంలో భారీ నిర్వహించి బస్టాండు సర్కిల్‌లో మానవహారంగా నిలబడ్డారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూడా పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.



ములకలచెరువులో మానవహారంగా నిలబడ్డ విద్యార్థులు, పోలీసులు

డీసీసీబీని కొల్లగొట్టేశారు..!?

- నిబంధనలకు విరుద్ధంగా వందల కోట్ల రుణాలు
- పులివెందుల ప్రాంతానికి అత్యధికం
- సీఐడీ విచారణ చేస్తే వాస్తవాలు తేటతెల్లం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 26: ఏదైనా అవసరం వచ్చి బ్యాంకు ద్వారా రుణం పొందాలంటే పలు ఆంక్షలు, నిబంధనలతో రుణగ్రహీతలను ఉక్కిరిబిక్కిరి చేస్తారు. ఇదంతా సామాన్యులకే. ఈ నిబంధనలు కొందరికి మాత్రం వర్తించవు. ఆ కొందరిలో అత్యధికంగా రాజకీయ పలుకుబడి ఉన్నవారే ముందు వరుసలో ఉంటారు. ఇక రాజకీయ నాయకుల పెత్తనం ఉండే సహకార బ్యాంకులైతే చెప్పనక్కరలేదు. కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) గత మూడు, నాలుగేళ్ల సమయంలో వందల కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసింది. అయితే.. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ నేతల ఆదేశాలే అర్హతగా బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేశారనే చర్చ సాగుతోంది. రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావడం కోసం భూములు తనఖా పెట్టుకుని మార్టిగేజ్ రుణం మంజూరు చేస్తుంటారు. మార్కెట్ విలువ మేరకు 70 నుంచి 85 శాతం వరకు రుణం పొందే అవకాశం ఉంటుంది. ఈ రుణాన్ని సకాలంలో వడ్డీతో సహా కంతుల వారీగా చెల్లించాల్సి ఉంటుంది. రుణం పొందిన రైతు తిరిగి సకాలంలో చెల్లించకపోతే తనఖా పెట్టిన భూమిని వేలం వేసి జమ చేసుకునే వెసులుబాటు బ్యాంకుకు ఉంటుంది. కానీ ఇటీవల డీసీసీ బ్యాంకు మంజూరు చేసిన రుణాలకు సంబంధించిన భూ యాజమాన్య పత్రాలపై కూడా అనుమానాలున్నాయంటూ బ్యాంకు అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. దీంతో తప్పుడు పత్రాలకు రుణాలు మంజూరు చేశారనే చర్చ సాగుతోంది.

పులివెందుల ప్రాంతానికే అత్యధికం

మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల ప్రాంతానికి డీసీసీ బ్యాంకు గతంలో అత్యధికంగా రుణాలు మంజూరు చేసినట్లు సమాచారం. దాదాపు రూ.400 కోట్ల రుణాలు అందించారని అంటున్నారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తుల ఇంటికి రెండు మూడు రుణాలు మంజూరు చేసినట్లు సమాచారం. ఒక ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడికి 3, 4 రుణాలు ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. ఈ రుణాల్లో దాదాపు కోటి రూపాయలకు పైగా ఆయన ప్రయోజనం పొందారని అంటున్నారు.

ప్రొద్దుటూరులోనూ..

ప్రొద్దుటూరులోని వైఎస్సార్ కాలనీ బ్రాంచ్‌తో పాటు మరో బ్రాంచ్‌లో కూడా భారీ స్థాయిలో రుణాలు మంజూరైనట్లు సమాచారం. గతంలో గృహ నిర్మాణాల కోసం ఇచ్చిన భూములకు కూడా రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ఆ భూముల్లో కొంత మేర గృహాలు నిర్మితమయ్యాయి. ఆ సర్వే నెంబర్ల ద్వారా కూడా నకిలీ పత్రాలు తయారు చేసుకుని రుణం పొందినట్లు చర్చ నడుస్తోంది. ప్రొద్దుటూరులోని డీసీసీ బ్యాంకు రెండు బ్రాంచుల్లో దాదాపు రూ.150 కోట్లకు పైగా రుణాలు మంజూరైనట్లు సమాచారం. గతంలో ప్రొద్దుటూరులోని ఒక బ్రాంచ్‌లో మేనేజరుగా పనిచేస్తూ ప్రస్తుతం ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి హయాంలో ఎక్కువ సంఖ్యలో నకిలీ పత్రాలకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఈయన హయాంలోనే నకిలీ బంగారానికి రూ.6 లక్షల మేర రుణం మంజూరు కాగా, ఈ అంశాన్ని మరో మేనేజరు గుర్తించినట్లు సమాచారం. దీంతో డీసీసీబీలో చక్రం తిప్పుతున్న ఓ సలహాదారుడు గుట్టుచప్పుడు కాకుండా ఆ మొత్తాన్ని జమ చేయించి ఆ అధికారిని కాపాడారని ప్రచారం సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిజమైన రైతులకంటే బినామీలకే అత్యధికంగా రుణాలు మంజూరైనట్లు బ్యాంకు వర్గాల సమాచారం.



రికవరీ ప్రశ్నార్థకమే

ఇబ్బడిముబ్బడిగా రుణాలు మంజూరు చేయడం సంతోషకరమే. అవి నిబంధనలకు అనుగుణంగా పంపిణీ చేసినట్లయితే రైతాంగం బాగు పడుతుంది. కానీ అక్రమ మార్గంలో వైసీపీ ప్రభుత్వ అనుయాయులకు ఈ రుణాలు అందినట్లు సమాచారం. నకిలీ పత్రాలకు రుణం మంజూరు చేశారని అంటున్నారు. ఇదే జరిగి ఉంటే రుణ వసూళ్లు ప్రశ్నార్థకమే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాయచోటి ప్రాంతాల్లోని రైతులకు డీసీసీ బ్యాంకుల ద్వారా అధిక సంఖ్యలో రుణాలు మంజూరు చేశారు. వందల కోట్లలో ఇచ్చిన రుణాలను తిరిగి వసూలు చేయడం బ్యాంకు అధికారులకు తలకు మించిన భారంగా కనిపిస్తోంది. ఇదే పరిస్థితి ఉమ్మడి కడప జిల్లాలో 2014 ముందు కూడా చోటు చేసుకుంది. నకిలీ పత్రాలకు కోట్ల రూపాయల రుణాలు అందించి స్వాహా పర్వానికి గత పాలకవర్గాలు తెరలేపాయి. దీంతో అప్పట్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో రాజంపేట, రైల్వేకోడూరు, బద్వేలు ప్రాంతాల్లోని పలు సొసైటీలపై సీబీ సీఐడీ అప్పట్లో విచారణ చేపట్టింది. పలువురిపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. ఇదే తరహాలో ప్రస్తుతం పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాయచోటి నియోజకవర్గాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు వాటికి సంబంధించిన డీసీసీ బ్యాంకు బ్రాంచ్‌ల్లో సీఐడీ ద్వారా సమగ్రంగా విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశాలు లేకపోలేదు.

అక్రమాలకు సహకరించారని అందలం

జిల్లాలో రాజకీయ నేతల అక్రమాలకు సహకారం అందించారనే ఉద్దేశ్యంతో బ్యాంకు పరిధిలోని ఓ అధికారికి పదోన్నతి కల్పించినట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కువ మొత్తంలో రుణం మంజూరు కావాలంటే బ్రాంచ్ మేనేజరు రుణపత్రాలను డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపించాల్సి ఉండేది. అధిక మొత్తంలో రుణం మంజూరు కావాలంటే డీసీసీ బ్యాంకులోని ఏజీఎం, డీజీఎం, జీఎం స్థాయిల్లో పత్రాలు, భూములకు సంబంధించి విచారణ చేయాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ లేకుండానే కోట్లాది రూపాయలు రుణ రూపంలో బ్యాంకు నుంచి కొల్లగొట్టారనే చర్చ సాగుతోంది. డీసీసీ బ్యాంకు ద్వారా ఇచ్చే నిర్దేశిత మొత్తాన్ని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మరింత పెంచి ప్రధాన కార్యాలయ అధికారుల పాత్ర లేకుండానే రుణాలు మంజూరు చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో రాజామణిని ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు.



అసంపూర్తిగా ఉన్న మురుగుకాల్వను దాటేందుకు ఇబ్బందులు పడుతున్న కళాశాల విద్యార్థినులు



వేంపల్లెలో ప్రధాన రోడ్డుపైకి మురుగునీరు చేరడంతో గుంతలు పడి అవస్థలు పడుతున్న వాహనదారులు

ఈ కష్టాలు తీరేదెప్పుడో..!

- నిలిచిపోయిన రోడ్డు, కాల్వ నిర్మాణ పనులు
- బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- వేంపల్లె ప్రజల అవస్థలు

వేంపల్లె, జూన్ 26: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇలాఖ పులివెందుల నియోజకవర్గంలోని ప్రధాన మండల కేంద్రం వేంపల్లె. వైఎస్ జగన్ సీఎం అయ్యారు. వేంపల్లెలోని రోడ్లకు మహర్దశ వస్తుందని ప్రజలంతా భావించారు. ఐదేళ్ల పాలనలో రోడ్లన్నీ పూర్తవుతాయని ఎంతో ఆశించారు. ఆ ఆలోచన మూడేళ్లకు కార్యరూపం దాల్చింది. వేంపల్లె పట్టణంలోని హనుమాన్ జంక్షన్ నుంచి కడప రోడ్డులో నాలుగురోడ్ల కూడలి మీదుగా పులివెందుల రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు రోడ్ల విస్త రణ, కాల్వల నిర్మాణం కోసం రూ.30కోట్లతో పనులు మంజూరయ్యాయి. విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం పంపిణీ చేసేందుకే సుమారు ఏడాదికి పైగా కాలం పట్టింది. ఆరు నెలల క్రితం పనులు హడావిడిగా పనులు మొదలు పెట్టారు. ఈలోగా ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో పనులన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. ఎన్నికలకు ముందే రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ వారం రోజుల క్రితం మురుగుకాల్వల నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేశారు. ఈ పనులు ఎప్పుడు మొదలుపెడతారో, ఎప్పుడు పూర్తవుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో వేంపల్లె ప్రజలకు కొత్త కష్టాలు మొదలయ్యాయి.

బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్

వేంపల్లెలో రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణానికి ఎంసీఎస్ఆర్ కంపెనీ పనులు చేపట్టింది. రూ.28కోట్ల వ్యయంతో 3.80 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం, రెండు వైపుల కాల్వల నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించింది. 1600 మీటర్ల రోడ్డు మాత్రమే ఇప్పటి వరకు వేశారు. రెండు వైపుల కలిసి ఆరు కిలోమీటర్ల మేర కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. ఏడు కోట్ల రూపాయల మేర ఎన్నికల ముందే బిల్లుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపినప్పటికీ బిల్లులు విడుదల కాలేదు. దీంతో కాంట్రాక్టర్ చేతులెత్తేసి మొదట రోడ్డు పనులు, ఎన్నికల అనంతరం కాల్వ నిర్మాణ పనులను ఎక్కడివి అక్కడే వదిలేశారు.

ఎన్ని ఇక్కట్లో...

వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లలో వర్షపు నీరు సక్రమంగా పోయే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. వీరందరు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక చాలాచోట్ల కాల్వ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మురుగునీరు వెళ్లే దారి లేక ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఇళ్ల యజమానులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కడప-పులివెందుల రోడ్డులో నిలిచిపోయిన రోడ్డు పనులు

ఏఈ ఏమన్నారంటే..

రోడ్డు, కాల్వ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం.

-వెంకటరమణ, ఆర్అండ్‌బీ ఏఈ

ఆర్జీయూకేటీ అడ్మిషన్ కన్వీనర్‌గా అమరేంద్రకుమార్



వేంపల్లె, జూన్ 26: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నడుస్తున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 2024-25 అడ్మిషన్ ప్రక్రియ కన్వీనర్‌గా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్రను నియమించారు. ఈ ఏడాది జరగబోయే అడ్మిషన్ ప్రక్రయ ఆయన ఆధ్వర్యంలో జరుగుతుంది. గతంలో నూజి వీడులో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గోపాల్‌రాజు కన్వీనర్‌గా ఉండగా.. ఆయన స్థానంలో అమరేంద్ర నియమితులయ్యారు. అడ్మిషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తామని కన్వీనర్ అమరేంద్ర తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ సీట్లకు 53,863 దరఖాస్తులు

వేంపల్లె,జూన్ 26: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా 53863 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతనెల చివరి వారంలో 2024-25 విద్యా సంవత్సరంలో ట్రిపుల్‌ఐటీల్లో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సుకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో 1100సీట్ల చొప్పున 4400 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరగా గత ఏడాది 40వేల దరఖాస్తులు రాగా.. ఈ ఏడాది మరో 13వేలకు పైగా దరఖాస్తులు పెరగడంతో 53863 దరఖాస్తులు వచ్చాయి. 10వ తరగతిలో వచ్చిన మార్కులు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులు కలిపి మెరిట్ జాబితాను తయారు చేసి జూలై 11న ఎంపిక జాబితా విడుదల చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని మార్కుల ఆధారంగా జాబితాను రూపొందించి విడుదల చేస్తామని అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర తెలిపారు.

జమ్మలమడుగులో హోటళ్లపై దాడులు

- హోటళ్లలో లోపించిన శుభ్రత
- యజమానులకు నోటీసులు



బిర్యానీలో వాడే పదార్థాలను తనిఖీ చేస్తున్న ఉమ్మడిజిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, బిర్యానీ హోటల్‌లో కాగుతున్న నూనెను పరిశీలిస్తున్న సిబ్బంది

జమ్మలమడుగు, జూన్ 26: జమ్మలమడుగులో బుధవారం ఉమ్మడి జిల్లా ఆహార భద్రతా అధికారి జె.ప్రభాకర్, వారి సిబ్బంది హోటళ్లపై దాడులు చేశారు. రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టారు. ముందుగా బిర్యానీ హోటళ్లలో తనిఖీ చేసి అక్కడ నూనె, బిర్యానికి వాడే పదార్థాలు, ప్యాకెట్లు పరిశీలించారు. ప్యాకెట్లపై డేట్ లేకపోవడం, శుభ్రత పాటించ కపోవడంతో నోటీసులు ఇచ్చారు. అలాగే బేకరీ షాపులపై సైతం దాడులు చేప ట్టారు. ఇక్కడ ఎక్కువగా కలర్లు, టేస్టీసాల్ట్ వాడుతున్నారని ఆరోపణలున్నప్పటికీ బుధవారం చేసిన తనిఖీల్లో బయటపడలేదు. ముందస్తుగానే సంబంధిత సిబ్బంది హోటల్ యజమానులకు తెలియజేయడంతో హోటళ్ల యజమానులు వెంటనే అప్రమత్తమైనట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కాగా, ఉమ్మడి జిల్లా ఆహార భద్రత అధికారి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగుకు తనిఖీ చేయడానికి రావడం జరిగిందన్నారు. ఇక్కడ నూనె, ఇతర ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకుని, బిర్యానీ శాంపిల్ పొట్లాలపై తేదీలు లేకపోవడంతో నోటీసులు ఇచ్చామన్నారు. ప్రజలు హోటళ్లపై నమ్మకంతో వస్తుంటారని.. ప్రతి హోటల్ యజమాని శుభ్రత పాటించాలని ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆహారభద్రత అధికారితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పదార్థాలలో నాణ్యత లోపిస్తే చర్యలు



ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా

ప్రొద్దుటూరు, జూన్ 26: హోటళ్లలో ఆహారపదార్థాలు నాణ్యతగా లేకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు హోటళ్లపై మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ అధికారులు నాలుగు బృందాలుగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హోటళ్లలోని ఫ్రిజ్‌లలో చికెన్, మాంసం లాంటి పదార్థాలు నిల్వ పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్ళలో పరిశుభ్రత పాటించాలన్నారు. డ్రైన్ పబ్లిక్ కాలువలోకి పెట్టకూడదని.. వ్యర్థాలు బయట పారవేయరాదని హెచ్చరించారు. బిర్యానీ సెంటర్లలో వాడే నూనెలు పరిశీలించారు. మసాలాలు ఇతరత్రాలపై సూచనలిచ్చారు. చనిపోయిన జంతువుల మాంసం, చికెన్‌లాంటి వి వాడినట్లు ఆరోపణలు వస్తే హోటళ్లు మూసివేస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉట్టికిరణ్, నూర్‌బాషా, వంకం సుబ్బరాయుడు సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, పద్మావతిలు మాత్రం ఈ తనిఖీల్లో పాల్గొనలేదు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

కడప (క్రైం), జూన్ 26: కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో బుధవారం ఓ యువతి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న కొట్టిపాటి భానుశ్రీ (21) ప్రైవేటు కాలేజీలో ఎంబీఏ చదువుతుంది. అక్క చెల్లెలు ఇద్దరూ అరుచుకోవడంతో భానుశ్రీని తల్లి మందలించింది. దీంతో ఆ యువతి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు దగ్ధం - రూ.14లక్షలు ఆస్తి నష్టం



దగ్ధమైన కారు

మంటలను అదుపు చేస్తున్నఫైర్ సిబ్బంది

కడప (క్రైం), జూన్ 26: కడప నగరం అరవిందనగర్‌లో మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో పార్కింగ్ చేసిన కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. కారుతో పాటు ఇంట్లో ఉన్న కొన్ని సామాన్లు కాలిపోయాయి. ఇంటి యజమాని హరికుమార్ ఫిర్యాదు మేరకు కడప ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. కారు ఇంజన్ నుంచి మంటలు రేగి కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని.. దాదాపు రూ.14లక్షల మేర నష్టం జరిగినట్లు కడప ఫైర్ సిబ్బంది తెలిపారు.

ఇంద్రభవనాలను తలపించేలా వైసీపీ కార్యాలయాలు

- నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు... పులివెందులలో జరిగిన పనులపై ఆరా తీస్తున్నాం
- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూన్ 26: నిబంధనలు పాటించకుండా వైసీపీ కార్యాలయ భవనాలను ఇంద్రభవనాలను తలపించేలా నిర్మిస్తున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులో మాట్లాడుతూ అన్ని నిబంధనలు పాటించినా టీడీపీ ప్రభుత్వం తమ కార్యాలయాలను కూలదోస్తోందని వైసీపీ గగ్గోలు పెడుతోందన్నారు. చిన్న ఇళ్లు కట్టుకోవాలన్న మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో చెబుతుండేవారన్నారు. 26 జిల్లాల్లోని కొన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్‌లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ స్థలాలు లేవని చెప్పిన వైసీపీ ప్రభుత్వ అధికారులు అవే జిల్లా కేంద్రాలలో వైసీపీ కార్యాలయాలను నిర్మించిందన్నారు. ఆ కార్యాలయాలకు మున్సిపల్ అధికారుల వద్ద అప్రూవల్స్ తీసుకోలేదన్నారు. ఆ ప్రభుత్వ భూములను రాంకీ ఇన్‌ఫ్రా పేరుతో తీసుకొని రాంకీ సంస్థనే ఆ కార్యాలయాలను నిర్మిస్తోందన్నారు. ఇదే క్విడ్‌ప్రోకో అన్నారు. కోట్లాది రూపాయల భూములు అప్పనంగా తీసుకొని కార్యాలయాలు నిర్మించారన్నారు. దానిని సాక్షి చానల్‌లో వక్రీకరిస్తున్నారన్నారు. అందులో అనుమతుల మేరకే నిర్మిస్తున్నామని చెప్పడం గాని, చూపించే ప్రయత్నం చేయలేదన్నారు. అలాగే ప్రతిపక్షనేత కూడా కాని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దాదాపు 300 మంది భద్రత కల్పించడం తెలుగు దేశం పార్టీ గొప్పదనమన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నిష్పక్షపాతంగా పాలన అందిస్తున్నారని అర్థం చేసుకోవాలన్నారు. పులివెందులలో పాడా ద్వారా ఏ పనులు ఎక్కడ చేశారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా వేల కోట్ల రూపాయలతో పనులు చేసిన పాడాపై గత ఐదేళ్లుగా ఆడిట్ జరగలేదన్నారు. ఇపుడు ప్రభుత్వం మారడంతో తమకు అనుకూలమైన ఓ మహిళా ఆడిట్ అధికారిణితో హడావిడిగా ఆడిట్ చేయిస్తున్నారన్నారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా ఉంటారని అధికారులు అనుకొని ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. గండి క్షేత్రంలో ప్రసాదాల పంపిణీ నుంచి విరాళాల సేకరణ వరకు అవినీతి జరిగిందని ఆరోపించారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ చేయిస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఆర్జేడీ

సుండుపల్లె, జూన్ 26: ప్రభుత్వ బడుల్లో ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్య లభిస్తుందని విద్యార్థినీ, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈవో శివప్రకాశ్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని గుట్టకిందరాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు, టెస్ట్ బుక్స్, స్కూల్ బ్యాగ్‌తో పాటు ఇతర విద్యా సామాగ్రి అందజేసినట్లు తెలిపారు. మెరుగైన విద్యను అందించే ప్రభుత్వ బడుల్లో చదివిన ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు శ్రీనివాసరాజు, మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్, ప్రధానోపాధ్యాయురాలు సుమలత తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు రూ.2.70 లక్షల ఆర్థిక సాయం



చిన్నారులకు సహాయం చేస్తున్న దాతలు

మైదుకూరు రూరల్, జూన్ 26: మైదుకూరులోని పాతూరులో నివశిస్తున్న ఈశ్వర్ గుండెపోటుతో, అతని భార్య రమాదేవి బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఒకే నెలలో మృతి చెందారు. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. పిల్లలను ఆదుకోవాలంటూ ఈనెల 16 తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించి చాలా మంది దాతలు మేమున్నామంటూ ముందుకొచ్చి ఆర్థికసాయం చేశారు.

ఈనేపథ్యంలో మైదుకూరు బీజేపీ నియోజకవర్గఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు రూ.50 వేలు, అంగడి శ్రీను అనే వ్యక్తి రూ.2లక్షలు, కూశెట్టి రాయుడు రూ.20 వేలు చిన్నారులకు అందజేశారు. అంతే కాకుండా పొలాల్లో కూలీ పనులకు వెళ్లి జీవనం సాగి స్తున్న మహిళ కూలీలు కూడా ఒక్క రోజు కూలీ డబ్బు లను పిల్లలకు ఆర్థిక సాయంగా అందించారు. ఈ డబ్బు లను పిల్లల భవిష్యత్ కోసం వారి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్లు సమాచారం.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి: డీఈవో

సుండుపల్లె, జూన్ 26: విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. బుధవారం సుండుపల్లె ఉన్నత పాఠశాల, నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మండల మొదటి స్థానాన్ని సుండుపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే నూతనంగా ఏర్పాటు అయిన జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదివి జిల్లా స్థాయిలో మార్కులు సాధించాలన్నారు. సుండుపల్లె విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్రరాజు, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో

కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి : జడ్జి

కడప(రూరల్) జూన్ 26: హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో జిల్లా స్థాయి మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్జి హిట్ అండ్ రన్ కేసులు, ఫస్ట్ యాక్సిడెంట్ రిపోర్టు, జిల్లా స్థాయి కమిటీ పనితీరు, పరిహార ప్రక్రియ, బాధితులకు పరిహారం జారీ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కడప డీటీసీ, డీఎస్పీ రవికుమార్, అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ శ్రీధర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె. రవీంద్ర, పలువురు ఆర్‌డీఓలు పాల్గొన్నారు.

పిల్లల విద్యా, అరోగ్య విషయాలపై జాగ్రత్త వహించాలి

ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహంలోని పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా జడ్జి తరగతి గదులను, వంటశాలలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు.. ఏవైనా సమస్యలుంటే డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలన్నారు.



వసతి గృహంలోని భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబాఫకృద్దీన్

మాదక ద్రవ్యాలతో జీవితం బుగ్గిపాలు





రైల్వేకోడూరు: పాత బస్టాండు వద్ద విద్యార్థులతో మానవహారం, రాజంపేట: సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ చైతన్య

● రాజంపేట డీఎస్పీ చైతన్య

రాజంపేట, జూన్ 26: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం బుగ్గిపాలు అవుతుందని రాజంపేట డీఎస్పీ చైతన్య పేర్కొన్నారు. రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచంలో యువకులు సరదా కోసం మాదక ద్రవ్యాలకు అలవాటు పడి చిన్నతనంలోనే జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రధానంగా యువకులు గంజాయి, మద్యం లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడడం, తద్వారా మరణించడం బాధాకరమన్నారు. మరికొంతమంది యువకులు నిషా కోసం మత్తు ఇంజక్షన్లు వేసుకుంటున్నారన్నారు. వీటిని నివారించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, పార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.స్వర్ణలత, పీజీ కళాశాల ప్రిన్సిపల్ సమతానాయుడు, సీఐలు రవీంద్రనాథ్, మంజునాథ్‌రెడ్డి, మద్దయ్యఆచారి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలో మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మాదక ద్రవ్యాలపై ర్యాలీ

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా అన్నమాచార్య ఫార్మశీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ సంధ్య, సీఐలు, ఎస్ఐలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మాదకద్రవ్యాలను కట్టడి చేసేందుకు నూతన ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని రాజంపేట డీఎస్పీ చైతన్య తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు ప్రధానదారిలో మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలను తీసుకుని రావడం, విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువకులు డ్రగ్స్‌ను వాడకుండా ఉండాలన్నారు. అమ్మడం, కొనడం, తాగడం కూడా నేరమన్నారు. దీన్ని కట్టడి చేయడానికి ప్రభుత్వం అనేక నిఘాలు పెట్టిందన్నారు. గంజాయి, హెరాయిన్, బ్రౌన్‌షుగర్ లాంటివి యువకులు వాడకూడదన్నారు. డ్రగ్స్ వాడి భయటపడితే చర్యలు ఉంటాయన్నారు. డ్రగ్స్‌కు యువకులు, విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వాడితే జీవితాలు దుర్భరం అవుతాయన్నారు. ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా కుటుంబంలోను, సమాజంలోను మంచి అభిప్రాయం ఉండదన్నారు. విద్యార్థులు, యువకులు తదితరులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ టి.బాబు, రూరల్ సీఐ సురేంద్రనాథ్‌రెడ్డి, ఎస్ఐలు డాక్టర్ నాయక్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండల కేంద్రంలోని సిద్దవటంలో బుధవారం మాదకద్రవ్యాలపై విద్యార్థులచే ఎన్‌ఫోర్స్ డిపార్టుమెంట్ అధికారులు, పోలీసులు అవగాహన ర్యాలీ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత

చిట్వేలి, జూన్ 26: మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుందని, అందుకు యువత ముందుకు రావడం ఆదర్శనీయమని ప్రకృతి ప్రేమికులు, వైద్యులు దొండ్లవాగు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రం సింగనమల వీధిలోని కోదండరామ స్వామి ఆలయంలో యువత మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వైద్యులు చంద్రశేఖర్, స్థానిక నాయకుడు సుబ్బరాయుడు పాల్గొని యువతతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కంచర్ల సుధీర్‌రెడ్డి, పిక్కిలి బాబు, పసల శివశంకర్, కృష్ణ, విజయ్, యశ్వంత్, వినయ్, షలీం తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మతల్లి జాతర

రైల్వేకోడూరు, జూన్ 26: మండలంలోని రెడ్డివారిపల్లె, ఉప్పరపల్లె, బిల్లుపాటిపల్లె గ్రామాల్లో గురువారం ఉదయం గంగమ్మతల్లి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఉప్పరపల్లెలో ఏడేళ్ల తర్వాత, రెడ్డివారిపల్లెలో మూడేళ్ల తర్వాత జాతర నిర్వహిస్తున్నారు. రాత్రి గంగమ్మతల్లి ప్రతిమను తయారు చేసి వీధుల్లో ఊరేగిస్తారు. శుక్రవారం నిమజ్జనం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



విద్యార్థిని సత్కరిస్తున్న కళాశాల సీఈఓ

రాజంపేటటౌన్, జూన్ 22: ఇంటర్ ఫలితాల్లో రాజంపేట రీజెన్సీ నలంద కళాశాలకు చెందిన ఆటో డ్రైవర్ కుమార్తె సంధ్య సీఈసీ విభాగంలో ప్రతిభ చూపినట్లు కళాశాల సీఈఓ గుడారు విజయచందు తెలిపారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డి కుమార్తె 500 మార్కులకు 494 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థి, ఆమె తండ్రిని ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం శాలువా కప్పి సత్కరించి ప్రోత్సాహక బహుమతిని అందజేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి



దళవాయిపల్లెలో కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌చార్జి

పుల్లంపేట, జూన్ 26: కూటమి కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటామని, అర్ధరాత్రి సమస్య వచ్చినా ఆదుకుంటామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిలు భరోసా ఇచ్చారు. దళవాయిపల్లెలో ఎన్నికల్లో జరిగిన ఘర్షణలో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన మల్లు రాజారెడ్డి, సిద్దిక్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దస్తగిరి కుటుంబాలను ఇన్‌చార్జితో కలిసి కూటమి నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మండల ఇన్‌చార్జి సుధాకర్‌నాయుడు, వెంకటసుబ్బయ్యయాదవ్, పంజగల వెంకటసుబ్బయ్య, దేవరకొండ నరసింహులు, కొండేటి రమణ, వడ్డిపల్లె రమణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల్లో నాణ్యత పాటించండి

చిట్వేలి, జూన్ 26: రహదారి పనుల్లో నాణ్యతను పాటించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం చిట్వేలి-కోడూరులో జరుగుతున్న రహదారి పనులను ఆర్‌అండ్‌బీ డీఈ జయప్రకాష్, ఏఈ నరేంద్రరెడ్డి, కాంట్రాక్టర్, ఓలి సుబ్బారెడ్డి మండల నాయకులతో కలిసి రూపానందరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, రాష్ట్ర నాయకులు మణి, గుత్తి నరసింహ, గుండయ్య, నరసింహ, నాగేశ్వరరావు, చెంగల్‌రాయుడు పాల్గొన్నారు.

ముక్కాను కలిసిన వెలుగు సిబ్బంది

ఓబులవారిపల్లె, జూన్ 26: టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిని చిట్వేలి మండలానికి సంబంధించిన వెలుగు సిబ్బంది వారి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రకళ, సీసీలు, సుబ్రమణ్యం, వీఓఏలు పాల్గొన్నారు.

చదువుకున్న బడికి రుణపడి ఉండాలి

సంబేపల్లె, జూన్ 26: ఉన్నత శిఖరాలను చేరుకున్న ప్రతి విద్యార్థి చదువుకున్న బడికి రుణపడి ఉండాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. గున్నికుంట్ల పాఠశాల పూర్వపు విద్యార్థి, ఉపాధ్యాయుడు మురళీమోహన్‌రాజు ప్రతి ఏడాది 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మనోహర్ అధ్యక్షతన విద్యార్థులకు నోటు పుస్తకాలను అందించారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు రెడ్డెన్న, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తాతిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలి

● ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్

రాయచోటిటౌన్, జూన్ 26: కేంద్ర ప్రభుత్వం సైనిక్ రిక్రూట్‌మెంట్ కోసం 2022లో తీసుకొచ్చిన అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 17 నుంచి 21 సంవత్సరాల మధ్య వయస్సున వారికి కేవలం నాలుగేళ్ల పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆ తరువాత వారిని విధుల నుంచి తీసేస్తే వారి పరిస్థితి ఏంటన్నారు.

'సమ్మె హామీలు అమలు చేయాలి'

రాయచోటిటౌన్, జూన్ 26: మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నూతన ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీ రమణ, పీవీ రమణ తెలిపారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి సి.రాంబాబు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మద్దతులో ఆంతర్యమేమిటి ?

రాజంపేట, జూన్, 26: లోక్‌సభ స్పీకర్ ఎన్నికల్లో బీజేపీ కూటమి బలపరిచిన స్పీకర్ అభ్యర్థి ఓం బిర్లాకు వైసీపీ ఎందుకు మద్దతు ఇచ్చిందో ఆ పార్టీ అధినేత జగన్ రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలని రాజంపేట టీడీపీ మైనార్టీ నాయకులు, పట్టణ ప్రధాన కార్యదర్శి మండెం అబుబాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీఏలో భాగస్వాములైన టీడీపీ, జనసేనలకు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనని సెక్యులర్ వాదులకు, మేధావులకు స్పష్టం చేసి.. ఇప్పుడు మద్దతు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వైసీపీ అధినేత ముస్లింలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రతిభ

రాజంపేట, జూన్ 26: జాతీయ కళాశాలల ర్యాంకింగ్‌లో రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల స్థానం పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ది వీక్ మ్యాగజైన్ ప్రచురించిన జాతీయ కళాశాల ర్యాంకింగ్‌లో వివిధ విభాగాల్లో టాప్ ర్యాంకులో నిలిచిందన్నారు. మనదేశంలో ప్రసిద్ధిగాంచిన ది వీక్ మ్యాగజైన్ సర్వే పత్రిక ఈ విషయాన్ని వెల్లడించిందన్నారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలల అధినేత చొప్పా గంగిరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టి కృషి వల్ల ఈ విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు.

కబ్జాదారుల చేతుల్లో కాలువలు : సీపీఐ

రాయచోటిటౌన్, జూన్ 26: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ అబ్బవరం సమీపంలో గల కంచాలమ్మ గండి కాలువలను భూ బకాసురులు మింగేశారని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సీపీఐ బృందం కంచాలమ్మ గండి పరివాహక ప్రాంత కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కంచాలమ్మ గండిచెరువు కాలువల ఏర్పాటులో నాడు భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి కాలువలు ఏర్పాటు చేశారన్నారు. తద్వారా దిగువ ప్రాంత భూములకు నీరు రావడంతో వరి పంటలు సాగు చేసుకునేవారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ మాఫియా కనుసన్నల్లో కంచాలమ్మ గండిచెరువును ఊట చెరువుగా మార్చి సాగునీరు అందకుండా చేశారన్నారు. ఇలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడిన భూబకాసురులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఎన్.రమేశ్, పట్టణ నాయకులు గణేశ్, ప్రసాద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం: సుగవాసి

నందలూరు, జూన్ 26: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో.. వచ్చే ఐదేళ్లలో ప్రతి కార్యకర్తకు అన్నివిధాల ఆదుకుంటామని వారి కష్టనష్టాల్లో పాలు పంచుకుంటానని టీడీపీ రాజంపేట నియోజకవర్గ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. బుధవారం నందలూరు షాదీఖానాలో రాజంపేట ఎన్డీఏ కూటమి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని పర్యటించి పార్టీ కోసం నిజాయితీగా పనిచేసిన వారికి భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు ఇవ్వడంతో పాటు ఆర్థికంగా వారికి తోడు నీడగా జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులందరం ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ రీజనల్ ఛైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శివరామరాజు, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దల విజయసాగర్, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ అమీర్, మున్వర్‌బాషా, విఠలాచార్య, మోడపోతుల రాము, హేమలత, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో వైసీపీ కార్యాలయాలు : చమర్తి

రాజంపేట, జూన్ 26: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ప్రభుత్వ భూముల్లో వైసీపీ కార్యాలయాలు ఏర్పాటు చేశారని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వైసీపీ కార్యాలయాల భవనాల నిర్మాణాలు చేపట్టారని, మరి ఆనాడు చెప్పిన మాటలు, నిబంధనలు మీ వైసీపీ భవనాలకు వర్తించవా అని ప్రశ్నించారు. అధికారులు అనుమతులు లేని భవనాలకు నోటీసులు జారీ చేస్తుంటే టీడీపీపై ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో కోవూరు సుబ్రమణ్యంనాయుడు, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, కోటయ్యనాయుడు, జీవీ సుబ్బరాజు, సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సక్రమంగా వైద్య సేవలందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

వీరబల్లి, జూన్ 26: ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసిన రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబ్ ఫార్మసీ వార్డులన్నీ పరిశీలించారు. సిబ్బందితో ప్రతిఒక్కరూ సరైన సమయానికి విధులకు హాజరు రావాలన్నారు. హెల్త్ క్యాంపులు ఫ్యామిలీ ఫిజీషియన్ డెలివరస్ బీసీజీ వ్యాక్సినేషన్ ఇమ్యూనైజేషన్ తదితర అంశాల గురించి వైద్యాధికారి మనీషాతో చర్చించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఆఫీస్ స్టాఫ్ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన వరం

● ఆర్జేడీ రాఘవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ

సుండుపల్లె, జూన్26: ఉపాధ్యాయ వృత్తి ఉపాధ్యాయులకు దేవుడిచ్చిన వరమని ఆర్జేడీ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తుట్టకిందరాచపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు షేక్.మహబూబ్‌బాషా పదవీ విరమణ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి ఎంతో మందిని దిక్సూచిగా పనిచేసి పదవీ విరమణ పొందడం ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరాజు, మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నాగరాజునాయక్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు చెంగల్‌రాయుడు, ఎస్‌టీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక ప్రణాళిక

● మున్సిపల్ కమిషనర్ వాసుబాబు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటిటౌన్, జూన్ 26: రాయచోటి పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తెలిపారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతంలో గల 4, 5, 6, 7, 8 వార్డుల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని స్లమ్ ఏరియాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రణాళికలను సిద్ధం చేసుకుని సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజల్లో మార్పు వచ్చే విధంగా చూడాలన్నారు. అలాగే పట్టణ పరిశుభ్రతలో పట్టణ వ్యాపారులు, ప్రజలు సహకరించి స్వచ్ఛ రాయచోటిగా తీర్చిదిద్దే విధంగా కలిసి రావాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పోషకాహారం అందించండి

● ఐసీడీఎస్ పీడీ శశికళ

సుండుపల్లె, జూన్ 26: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ శశికళ తెలిపారు. బుధవారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యతగా నిర్వర్తించాల్సిన విధులను తెలియజేశారు. సూపర్‌వైజర్లందరూ ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ ఖచ్చితంగా చేయాలని కోరారు. ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేలా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

● సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు

సిద్దవటం, జూన్ 26: డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు తెలియజేశారు. మండల పరిధిలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ లక్ష్మీపురం, మహబూబ్‌నగర్ గ్రామాల్లో బుధవారం మాధవరం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ పర్యవేక్షణలో డెంగ్యూ, మలేరియా వ్యాధి ప్రబలకుండా రోడ్ల పక్కనున్న మురికినీటిని, చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుబ్బరాయుడు హాజరై వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతిఒక్కరూ ఇంటిముంగిట, ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాన కల్పిస్తున్న డాక్టర్ రియాజ్‌బేగ్

సంబేపల్లె, జూన్ 26: వాతావరణంలో మార్పులు, వర్షాలు పడడం, మామిడి పండ్ల సీజన్ కావడంతో అతిసార వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్ తెలిపారు. బుధవారం దేవపట్ల పీహెచ్‌సీ పరిధిలో సోమవరం పంచాయతీ దేవలంపేట, డీఎస్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం జరుగుతుందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల కొత్త నీళ్ల కలుషితమవుతాయని, నీటిని కాచి వడపోసుకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున, పర్యవేక్షకులు మహబూబ్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ కరీముల్లా, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

రామాపురం, జూన్ 26: మండలంలోని రాచపల్లి పంచాయతీ వెంకటాపురానికి చెందిన వాసుదేవకుమార్ ఎంపీపీ పాఠశాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు బుధవారం రామాపురం ఎంఈవో రామకృష్ణుడు, జయచంద్రుల ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తన తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు కే.శే.వెంకటన్న జ్ఞాపకార్థంతో రాచపల్లె గ్రామంలో గంగనేరు, వెంకటాపురం, తెలుగు, ఉర్దూ, యూపీ, అంగన్వాడీ పాఠశాలలో విద్యార్థులకు పలకలు, పెన్సిళ్లు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై వేణుగోపాలుడు చిద్విలాసం



పెనగలూరు, జూన్ 26: పెనగలూరులో జరుగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రుక్మిణి సత్యభామ సమేతుడైన వేణుగోపాలుడు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బలిజ సంఘంలోని పోలిశెట్టి వంశస్థులు శ్రీవారి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం వసంతోత్సవ కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ సాగింది. కార్యక్రమంలో ధర్మకర్త సుబ్బయ్య, మాజీ ధర్మకర్త కొత్త బాలకృష్ణ, సభ్యులు టి.ధనుంజయ్య, ఎ.కృష్ణనాయుడు పాల్గొన్నారు.







చిన్నారి తాన్విక

నామకరణం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

శాంతిపురం మండలం తుమ్మిశి రోడ్డుకు చెందిన టీడీపీ వీరాభిమానులు అశోక్, సరస్వతి మనవరాలు, ప్రియాంక, సుధాకర్ దంపతుల కుమార్తెకు 'తాన్విక' అని సీఎం చంద్రబాబు నామకరణం చేశారు. బుధవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వినతుల స్వీకరణ సందర్భంగా వీరు వెళ్లి తమ బిడ్డకు నామకరణం చేయాలని చంద్రబాబును కోరారు. ఆ మేరకు ఆయన పేరు పెట్టారు.

వినతుల స్వీకరణ

కుప్పంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద బుధవారం ఉదయం ప్రజల నుంచి సీఎం చంద్రబాబు వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారి సమస్యలను విన్నారు. కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. తక్షణం పరిష్కారం కాని వాటిని ఆయా అధికారులకు పంపి వారం పది రోజుల్లో పరిష్కరించాలన్నారు.

బై.. వెళ్లొస్తా..!

రెండు రోజుల కుప్పం పర్యటన ముగించుకుని బుధవారం సాయంత్రం చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా పీఈఎస్‌లోని హెలిప్యాడ్ వద్ద ఆయనకు ఘన వీడ్కోలు లభించింది. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులు.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, బాబునాయుడు, రాజకుమార్, ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి తదితర నేతలు, శ్రేణులు, ప్రజలు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

- శాంతిపురం/గుడుపల్లె

చెట్టుపై నుంచి పడి టీడీపీ కార్యకర్త దుర్మరణం



చంద్ర(ఫైల్‌ఫొటో)

రామకుప్పం, జూన్ 25: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ వినాయకపురానికి చెందిన టీడీపీ కార్యకర్త చంద్ర(30) చెట్టుపై నుంచి పడి దుర్మరణం పాలయ్యాడు. బంధువులు, పోలీసుల కథనం మేరకు... చంద్ర మంగళవారం సాయంత్రం గొర్రెలకు ఆకు కోసం ఇంటి సమీపంలోని వేపచెట్టు ఎక్కాడు. ఆకులు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయాడు. అపస్మారకస్థితికి చేరుకున్న అతన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం ఆటోలో కుప్పం బయలుదేరారు. మార్గమధ్యంలో శాంతిపురం పాలారు బ్రిడ్జి వద్దకు వెళ్ళేసరికి అతను ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబసభ్యులు అతడి మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకువచ్చారు. మృతుడి భార్య భువనేశ్వరి ఘటనపై రామకుప్పం పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నందారెడ్డి, మునిరెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళీ, పెరుమాళ్, చంద్ర శేఖర్‌రెడ్డి, రంగనాథం, మురళీరెడ్డి, చంద్రారెడ్డి, రామచంద్ర, రామచంద్రరెడ్డి, గోపాలన్న, అమరనాథ్ తదితరులు చంద్ర మృతదేహానికి నివాళులర్పించారు.

వైసీపీకి ఓటు వేయలేదని మహిళపై దాడి



పుంగనూరు రూరల్, జూన్ 26: ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయలేదని ఓ మహిళపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడిన ఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన మల్లి భార్య సరస్వతి(45) ఇటుకల బట్టీ వద్ద ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తోంది. కమతంపల్లె, రాంపల్లెకు చెందిన మునిరాజ, వరలక్ష్మి, శ్రీనివాసులు, అంజి, కిషోర్‌తోపాటు మరికొందరు సరస్వతమ్మ ఇంటిపైకి దాడి చేసి గ్రామం వదిలి వెళ్లిపోవాలని, ఎన్నికల్లో వైసీపీ ఓటు వేయలేదని కొట్టి గాయపరిచడంతో ఆమె పోలీసులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చింది. ఎస్ఐ సుబ్బారెడ్డి సిబ్బందిని పంపడంతో అప్పటికే వైసీపీ శ్రేణులు పరారైనట్లు తెలిపారు. సరస్వతి ఫిర్యాదు మేరకు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల దాడి



గాయపడ్డ సుబ్రహ్మణ్యరెడ్డి

చౌడేపల్లె, జూన్26: వైసీపీ శ్రేణుల దాడితో టీడీపీ కార్యకర్త గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కథనం మేరకు ... మండలంలోని కాటిపేరి గ్రామానికి చెందిన ఎస్.సుబ్రహ్మణ్యంరెడ్డి మంగళవారం రాత్రి పాడిఆవులకు మేత వేసి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, రమణరెడ్డి రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త ఎస్.సుబ్రహ్మణ్యం రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే బాధితుడిని 108 వాహనంలో పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు కల్పించారు.

స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు : ఎస్పీ



ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్

మంగళం, జూన్ 26: ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ ఇంచార్జ్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్న విధానం, అడవుల్లో చేపడుతున్న కూంబింగ్ సమాచార వ్యవస్థ, అటవీశాఖ అధికారుల పనితీరు గూర్చి ఆరాతీశారు. అనంతరం అయన మాట్లాడుతూ స్మగ్లర్లను పట్టుకునేందుకు వీలుగా ఆపరేషన్లు చేపట్టాలని, ఫీల్డ్ ఆపరేషన్‌లో అటవీశాఖ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డీఎస్పీ చెంచుబాబు, ఏపీఎఫ్ శ్రీనివాస్, అర్ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, కుప్పానంద, చిరంజీవి, కడప, రైల్వేకోడూరు సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం

మంగళం, జూన్ 26: పీలేరు వద్ద తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్‌కు అందిన సమాచారం మేరకు.. పీలేరు ప్రభుత్వ ఐటీఐ సమీపంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఏపీ 31ఏడబ్ల్యూ 8433 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ వాహనం అటువైపుగా రావడాన్ని అధికారులు గమనించారు.దీంతో వాహనాన్నిఆపే ప్రయత్నం చేయగా, ఆపకుండా వెళ్లిపోయింది. వెంబడించగా కారును వదిలి వెళ్లిపోయారు. వాహనం, అందులో ఉన్న దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడ్డ ఎర్రచందనం 128.5కిలోల బరువు ఉందని డీఎఫ్‌వో శివకుమార్ తెలిపారు. పారిపోయినవారి కోసం గాలిస్తున్నారు. సిబ్బంది కోదండన్, చంద్రబాబు, సాయికిరణ్, నాగులయ్య, భార్గవ్, వినీల్‌కుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

6 కేజీల గంజాయి పట్టివేత

మంగళం, జూన్ 26 : తిరుపతి నగర శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ వద్ద 6 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు...బొమ్మల క్వార్టర్స్‌లో గంగాధర్, కృష్ణారెడ్డి,ఫరీదా అనే ముగ్గురు గంజాయి అమ్ముతున్నట్టు తెలుసుకున్న పోలీసులు బుధవారం వారిని అదుపులోకి తీసుకున్నారు.గతంలోనూ వీరు గంజాయి కేసుల్లో నిందితులైనట్లు గుర్తించారు.గంజాయి విక్రయాలతో ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పెడదారి పట్టడంతో పాటు స్థానిక యువత నేరాలు,ఘోరాలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు.నిందితులపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పూజారులే బాగలేరు!

కొందరు ఆ పార్టీకి తొత్తులుగా మారారు ● పార్టీ కేడర్‌పై చంద్రబాబు అసహనం

● పోలింగ్ కేంద్రాలవారీగా ఓటింగ్‌పై సమీక్ష ● మెజారిటీ తగ్గడంపై తీవ్ర అసంతృప్తి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ కేడర్

కుప్పం, జూన్ 26: 'దేవుడు బాగున్నాడు. భక్తులూ బాగున్నారు. పూజారులే బాగలేరు' అంటూ కొందరు నాయకుల పనితీరుపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తంచేశారు. 'ఇప్పటికి జరిగింది చాలు. ఇకమీదట ఇలా మిమ్మల్ని, నా నియోజకవర్గాన్ని వదిలేయను. ఇకపై నేనే నియోజకవర్గ పార్టీని సమన్వయం చేసుకుంటూ, వారానికోసారి సమీక్షించి నేరుగా టచ్‌లో ఉంటా'నని స్పష్టం చేశారు. కుప్పంలోని పీఈఎస్ ఆడిటోరియంలో బుధవారం ఆయన పార్టీ కేడర్‌తో సమావేశమయ్యారు. తనకు 48 వేల మెజారిటీ రావడంపైనే చాలా సమయాన్ని కేటాయించారు. ముఖ్యంగా స్టేజీమీద ఉన్న నేతలనే టార్గెట్ చేశారు. 35 బూత్‌ల్లో మైనస్ ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఆయా బూత్‌ల క్లస్టర్ ఇన్‌చార్జిలను నిలబెట్టి సంజాయిషీ కోరారు. 'ఎన్నికల ముందు చేసిన ఐవీఆర్ఎస్ సర్వేలో ఏయే బూత్‌ల పరిధిలో మైనస్ ఉందో నేను మీకు చెప్పాను. సరిచేసుకొమ్మని హెచ్చరించాను. అయినా మీరు ఖాతరు చేయలేదు. లోపాలను గుర్తించి సరిచేసుకోలేనివారు నాయకులు ఎలా అవుతారు?' అని నిలదీశారు. బాధ్యతలు తీసుకున్న చాలామందికి అత్యుత్సాహం ఎక్కువైపోయిందని, అందుకనే మెజారిటీ పడిపోయిందన్నారు. 'కొంతమంది ఆ పార్టీకి తొత్తులుగా మారారు. ఎన్నికల ముందు, తర్వాత కూడా కుమ్మక్కయారు. వారెవరో నాకు తెలుసు. అందరినీ సరిచేస్తా. అలాంటి వారిని ఏరేస్తా' అంటూ ఆగ్రహించారు. 'మీరు నా దగ్గర షో చేయడానికి, పదవుల కోసం ఇకపై రానవసరం లేదు. పనిచేసేవారెవరో, షో మాత్రమే చేసిందెవరో నాకు తెలుసు. పనిచేసిన వారిని గుర్తించి వారి ఇంటికే వెళ్లి పూలమాల వేసి మరీ లీడర్‌ను చేస్తా. అలాంటి వారికి సంపాదన మార్గాలు చూపుతా. స్వయంగా ఎదగడానికి అవకాశాలు కల్పిస్తా. ఇంతదాకా ఒక టర్మ్ గడిచింది. ఇకమీదట నాలోను, పార్టీ వ్యవహారాలలోనూ స్పష్టమైన మార్పు చూస్తారు' అని చంద్రబాబు చెప్పారు.

2029 ఎన్నికలే లక్ష్యం

'జరిగిందేదో జరిగిపోయింది. ఇకమీదట 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయండి' అని పార్టీ కేడర్‌కు చంద్రబాబు సూచించారు. 'నేను ఇదివరకులా నా నియోజకవర్గాన్ని ఇంకెవరి మీదో వదిలే ప్రసక్తే లేదు. నేరుగా సమీక్షలు జరుపుతాను. పార్టీని అట్టడుగు నుంచి పునర్వ్యవస్థీకరించడానికి చర్యలు తీసుకుంటాను. యువతకు ప్రథమ ప్రాధాన్యమిస్తా. మధ్యవయస్కులు, సీనియర్లు ఆ తర్వాతి రెండుమూడు స్థానాల్లో ఉంటారు. ఏ ఏజ్ గ్రూప్ వారైనా పనిచేసేవారికే పట్టం కడతా. అలాంటి వారిని గుర్తించడానికి నా పద్ధతులు నాకున్నాయి' అని అన్నారు. బూత్‌ల స్థాయిలో తానే ఎంపిక చేసి ఇన్‌ఛార్జిలుగా నియమిస్తానన్నారు.

కక్షసాధింపులొద్దు

గత అయిదేళ్ల పాలనలో జరిగినన్ని దాడులు, హింస, దారుణాలు ఎన్నడూ చూడలేదని చంద్రబాబు అన్నారు. 'నన్ను నైతికంగా దెబ్బతీయడానికి చూశారు. నియోజకవర్గంలో నేతలు, కార్యకర్తలపై దాడులు చేసి, ప్రలోభాలకు గురిచేసి నాయకత్వాన్ని దెబ్బతీయాలని కుట్రలు పన్నారు. అయినా వారి ఎత్తులు సాగలేదు' అని పేర్కొన్నారు. 'చాలామంది మన కార్యకర్తలు దాడులకు గురయ్యారు. అక్రమ కేసులలో తగులుకుని ఇబ్బంది పడ్డారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలు అల్లకల్లోలమయ్యాయి. అయితే మీరు నేరుగా దాడి చేసే కక్షపూరిత చర్యలకు పాల్పడవద్దు. ఎవరివల్ల మీమీద దౌర్జన్యాలు జరిగాయో పేర్కొంటూ పార్టీ లెటర్ ప్యాడ్లలో రాసి సంతకాలు పెట్టి, కార్యాలయంలో అందజేయండి. వాటిని ప్రతివారం నేను తెప్పించుకుని సమీక్షిస్తా. దౌర్జన్యకారులపై చట్టపరంగానే చర్యలు తీసుకుంటా' అని చంద్రబాబు స్పష్టంచేశారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ప్రశాంతత ఉంటుందని ప్రజలు ఫీల్ కావాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కుప్పంనుంచే ప్రారంభమై రాష్ట్రమంతా విస్తరించాలని ఆకాంక్షించారు.

కండిషన్ బస్సులను రోడ్లపైకి తీసుకొస్తాం

మోడల్‌గా కుప్పం బస్టాండ్ ● నూతన ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



కుప్పం బస్టాండులో నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

కుప్పం, జూన్ 26: 'ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే ఆర్టీసీ లక్ష్యం. దీనికోసం కండిషన్ కలిగిన బస్సులను రోడ్లపైకి తీసుకొస్తాం'అని రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. కుప్పం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బుధవారం ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవివర్మ, చంద్రశేఖర్, జి.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజినీరు యు.శ్రీనివాస్, రీజినల్ మేనేజరు జితేంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఐదు నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. బస్టాండు, డిపో, గ్యారేజీలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కుప్పం ఆర్టీసీ బస్టాండును రాష్ట్రంలోనే మోడల్ బస్టాండుగా చేస్తామన్నారు. అత్యున్నత ప్రమాణాలు కలిగిన బస్టాండుగా మార్చేలా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి నాలుగైదు రకకాలకు సంబంధించిన డీపీఆర్‌లు తయారు చేయాలని అధికారులను ఆదేశిస్తామన్నారు. కార్మికులు, ప్రజల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇక మంచి రోజులు వచ్చాయన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో నడిపించడానికి ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తామన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు కుప్పంనుంచి హైదరాబాదుకు, గురువారం ఉదయం 5 గంటలకు కుప్పంనుంచి నెల్లూరుకు ఈ కొత్త బస్సులు బయలుదేరుతాయన్నారు. వీటితోపాటు గతంలో రద్దయిన 30 సర్వీసులను మళ్లీ పునరుద్ధరిస్తామన్నారు. భవిష్యత్తులో కుప్పంనుంచి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సర్వీసులు నడుపుతామని మంత్రి చెప్పారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు, కార్మికులు టీడీపీకి ఏకపక్షంగా ఓట్లేసి గెలిపించి ఆదరించారని గుర్తు చేసుకున్నారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26: ఎస్వీయూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బి.చంద్రయ్య నియమితులయ్యారు. ఇప్పటి వరకూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ హుస్సేన్ తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన ప్రొఫెసర్ హుస్సేన్ టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రిజిస్ట్రార్ పదవి నుంచీ వైదొలిగారు. యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బి.చంద్రయ్యను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య బాధ్యతలు స్వీకరించారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు పి.కె.సుబ్రమణ్యం, ఎన్.సుబ్రమణ్యం, గుర్రంకొండ శ్రీధర్, రవిచంద్ర, ఎన్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, తదితరులు అభినందించారు.

18 ఇసుక ట్రాక్టర్ల సీజ్



తిరుచానూరు, జూన్ 26: తిరుచానూరు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 18 ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. స్వర్ణముఖినదిలో ఎక్స్‌వేటర్లను పెట్టి ఇష్టానుసారంగా వైసీపీ ఇసుక మాఫియా వందల ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తోంది. దీనిపై 'ఆగని ఇసుక దందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో స్పందించిన సెబ్ అధికారులు, పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. ఒక్క తిరుచానూరు వద్దే 18 ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

గుజ్జుపరిశ్రమల యాజమాన్యాలు సిండికేట్ అయ్యాయి..

● సీఎంకు టీడీపీ నేతల ఫిర్యాదు



సీఎంకు మామిడి రైతుల సమస్యలను వివరిస్తున్న దొరబాబు, సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, జూన్ 26: జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు సిండికేట్ అయ్యాయని, తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. కుప్పంకు వచ్చిన సీఎంను వారు బుధవారం కలసి మామిడి రైతుల సమస్యలను వివరించారు. దళారీ వ్యవస్థ వల్ల రైతులు టన్నుకు రూ.5 వేల వరకు నష్టపోతున్నారని చెప్పారు. మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు ట్రేడ్ వ్యాపారులతో కుమ్మక్కై రోజుకో ధర నిర్ణయిస్తున్నారని పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలను జిల్లాలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను, జిల్లా అధికారులను సైతం గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు లెక్కచేయడంలేదని వివరించారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు.

టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర

కిరాయి వ్యక్తులతో వైసీపీ నేతల ఒప్పందం ● బహిర్గతం కావడంతో తప్పొప్పుకున్న నిందితులు

● క్షమించి పెద్దమనసు చాటుకున్న ఎంపీటీసీ దంపతులు



సమావేశంలో ప్రసంగిస్తున్న మధుసూదన్

ఎర్రావారిపాలెం,జూన్ 26 : టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర పన్ని కిరాయి హంతకులకు సుపారీ కూడా ఇచ్చిన వైసీపీ నాయకుల వుదంతమిది. ఎర్రావారిపాలెం మండలం కూరపర్తివారిపల్లికి చెందిన అభ్యుదయవాది అన్నాసముద్రం మధుసూదన్ టీడీపీ నాయకుడు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇతను అదే గ్రామానికి చెందిన ఈశ్వరమ్మను గతంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈమె ప్రస్తుతం ఎంపీటీసీ. మధుసూదన్ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేని కొందరు పలుసార్లు గొడవపడ్డారు. మండలానికి చెందిన ఓ బడా వైసీపీ నాయకుడి సహకారంతో ఆ పార్టీ వర్గీయులు ప్రతాపరెడ్డి, సిద్ధరామిరెడ్డి, నారాయణరెడ్డి ఎంపీటీసీ దంపతులను హత్య చేసేందుకు కుట్ర పన్నారు. కేవీపల్లికి చెందిన కిరాయి వ్యక్తులతో రూ.5లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఎర్రావారిపాలెం, తిరుపతి ప్రాంతాల్లో కిరాయివ్యక్తులు రెండుసార్లు హత్యకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో ఎన్నికలు జరగడం, టీడీపీ అధికారంలోకి రావడంతో కిరాయి ముఠా పన్నాగం ఆలస్యమైంది.దీంతో హత్య చేసేందుకు తామిచ్చిన డబ్బు తిరిగి చెల్లించాలని కిరాయి వ్యక్తులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. అప్పటికే మధుసూదన్ మంచితనం గురించి తెలుసుకున్న కిరాయి వ్యక్తులు మనసు మార్చుకున్నారు. హత్య పన్నాగం గురించి అతడికే చెప్పి క్షమించాలని కోరారు. హత్య కుట్రదారులు తమతో జరిపిన ఫోన్ సంభాషణలను కూడా మధుకు వినిపించారు. హత్య కుట్ర బహిర్గతం కావడంతో గ్రామస్తులందరూ విస్మయం చెందారు. ఈ నేపథ్యంలో ఆరేటమ్మ గుడి ప్రాంగణం వద్ద బుధవారం మండలానికి చెందిన పెద్దలందరూ సమావేశమై వైసీపీ నేతలు ముగ్గురినీ పిలిపించారు.కుట్రదారులు తమ అపరాధాన్ని మన్నించాలని వేడుకొన్నారు. ఆరేటమ్మ గుడి అభివృద్ధికి తలో రూ.10 లక్షలు ఇస్తామన్నారు. వీరిని గ్రామ బహిష్కరణ చేయాలని తీర్మానించినా మధుసూదన్ వద్దని వారించారు. కక్షప్రతీకారం వీడి కలసి ఉందామని హితవు పలికారు.ఈలోపు కుట్రదారులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కారు, ఎర్రచందనం దుంగలతో ఫారెస్టు అధికారులు

పీలేరు, జూన్ 26: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనంతో సహా 4 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ తిరుపతి ఎఫ్ఎస్వో జేవీ కోదండన్ బుధవారం తెలిపారు. పీలేరు మీదుగా ఎర్రచందరం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో తాము పీలేరు పట్టణ శివార్లలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బుధవారం ఉదయం 3.15 గంటల సమయంలో మారుతీ సుజుకీ ఎస్ఎక్స్ కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయిందన్నారు. తాము దానిని వెంబడించగా, ఆ కారులోని వారు వాహనాన్ని వదిలి పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా అందులో 128.5 కేజీలు బరువున్న 4 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం కూడా గాలిస్తున్నామన్నారు. ఈ దాడిలో తనతోపాటు ఎఫ్‌బీవో చంద్రబాబు, సిబ్బంది సాయికిరణ్, నాగులయ్య, వినీల్ కుమార్, భార్గవ్, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, జూన్ 26: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ రవికుమార్ తెలిపారు.. నిమ్మనపల్లె మండలం, బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి(42) మే 20వ తేదీన పుంగనూరు రోడ్డు జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చెన్నైలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదహాన్ని పంచనామా కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి తాళాలు తీసి బంగారు, వెండి చోరీ

మదనపల్లె అర్బన్, జూన్ 26: ఇంటి తాళాలు తీసి పది లక్షల విలువైన బంగారం, వెండి, నగదు చోరీ చేసిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. మండలంలోని ఎగువకురవంక గ్రామం సరస్వతినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేష్‌నాయుడు రెండు రోజుల క్రితం నిమ్మనపల్లెకు వెళ్లాడు. అక్కడ ఇంటి తాళాలు పోగొట్టుకున్నాడు. బుధవారం ఉదయం మదనపల్లెకు వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడం కనిపించింది. దీంతో లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాను తెరచి అందులోని పది లక్షలు విలువ చేసే బంగారు, వెండి, నగదును దొంగలు తస్కరించినట్లు గుర్తించారు. వెంటనే మదనపల్లె రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ ఎన్ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మాతమ్మ ఉత్సవాలు

నిమ్మనపల్లి, జూన్ 26: మండలంలోని పెద్ద మాదిగ పల్లి జడ్పీ హై స్కూ ల్ వద్ద మాతమ్మ తిరుణాల సందర్భంగా బుధ వారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంక రించా రు. గురువారం దివ్వెలు, బోనాలు సమర్పించడంతో పాటు కుంకుమార్చన, సకల లాంఛనాలతో అభిషేకాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అమ్మవారిని ఊరేగించనున్నట్లు వివరించారు. శుక్ర వారం విచిత్రమైన వస్త్రధారణ, ఆట పాటలతో తిరుణాల ముగుస్తుందని తెలిపారు.

ఘనంగా పాలేటమ్మ జాతర

గుర్రంకొండ, జూన్ 26:మండలంలోని ఎల్లుట్ల గ్రామ దేవత పాలేటమ్మ జాతరను బుధవారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు దివ్వెలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చాందినీ బండ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

మదనపల్లె అర్బన్, జూన్ 26: స్థానిక నెహ్రూబజార్‌లో నడివీధి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ ఈవో రమణ, అర్చకుడు గోవర్ధన్, చీర, సారె సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు దీలు, బోనాలు ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మకు సమర్పించారు.

డ్రగ్స్ వినియోగం.. భవిష్యత్తు అంధకారం


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


కలికిరి: సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

పీలేరు, జూన్ 26: మాదక ద్రవ్యాల వినియోగం, భవిష్యత్తును అంధకారం చేస్తుందని రాయచోటి డీఎస్పీ శ్రీధర్, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి విద్యార్థులు, ప్రజలకు తెలిపారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం వారు పీలేరులో ఎస్ఈబీ అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యసనం అనాగరికతకు చిహ్నమని, దాంతో దేశ అభివృద్ధి కుంటుపడడమే కాకుండా ప్రజల వ్యక్తిగత అభివృద్ధికి కూడా ఆటంకంగా మారుతోందన్నారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండడమే కాకుండా సమాజంలోని ఇతరులకు కూడా వాటి వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి.

ములకలచెరువు: సీఐ మధు, ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, ఎస్ఐ తిప్పేస్వామి అధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండు సర్కిల్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరించారు. జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరి: విద్యార్థి దశలో మాదక ద్రవ్యాలకు ఆకర్షితులైతే వారి భవిష్యత్తుకు ముగింపు పలికినట్లేనని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. బుధవారం కలికిరి పట్టణంలోని కళాశాలల విద్యార్థులకు పోలీసులకు అవగాహన కల్పించారు. కలికిరి సీఐ ఆర్.మోహన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా వుంటూ చదువులపై ధ్యాస కొనసాగించాలని కోరారు. డ్రగ్స్ చుట్టూ సామాజిక, మానసిక, శారీరక, చట్టపరమైన ఎన్నో సమస్యలున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ దేవేంద్రకుమార్, పోలీసు సిబ్బంది, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: అన్నమయ్యజిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా చేయాలని మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం మదనపల్లె పట్టణంలో విద్యార్థులతో కలిసి అంబేద్కర్ సర్కిల్ వద్ద ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టొబాకో, గంజాయి, మత్తు పదార్థాలు వాడకుండా చూడాల న్నారు. యువతను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడుతున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 14500కు సమాచారం ఇవ్వాలన్నారు. మదనపల్లె పురవీధుల్లో డ్రగ్స్ వాడకం నివారించాలని, అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఆలయ భూములను కాపాడుతాం : ఎమ్మెల్యే


ఆంజనేయస్వామి ఆలయ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 26: పట్టణంలో బాహుదానది ఒడ్డున ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. బుధవారం ఆయా భూములను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు భూస్వాములు సర్వే నెంబర్ 296లో 1.06 ఎకరాల భూమిని ఆలయ నిర్వహణకు రాసిచ్చారన్నారు. ఈ భూమిని కొంతమంది ఆక్రమించుకుని షెడ్లు వేసుకుని బాడుగలకు ఇచ్చారన్నారు. దీనిపై సర్వే చేసి, ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించామన్నారు. దేవాదాయ శాఖ అధికారులతో చర్చించి, ఈ భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఆదాయాన్ని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. టీడీపీ నాయకుడు బాలుస్వామి, గంగారపు నవీన్, గ్రూప్‌టెంపుల్స్ ఈవో పి.రమణ పాల్గొన్నారు.

డ్రైనేజీని ఆ ధునికీకరించాలి

పట్టణంలో డ్రైనేజి వ్యవస్థను ఆధునికీకరించాలని ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ మైదానం ఇరువైపులా మురుగు కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరుగట్టువారిపల్లె, రెడ్డీస్ కాలనీ, వివేకానందనగర్ కాలనీ నుంచి వచ్చే మురుగునీరు వెళ్లేందుకు కచ్చా కాలువలు లేకపోవడంతో వర్షం వస్తే మురుగునీరు కలసి రోడ్డుపై పొర్లుతోందన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా మురుగు కాలువలను వెడల్పు చేసి కొత్త కాలువలను నిర్మించాలన్నారు. దీనిపై ప్రణాళిక రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. మున్సిపల్ కంపోస్టు యార్డును పరిశీలించారు. పారిశుధ్య పనులను విభజించి నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

1న ఇంటి వద్దకే పింఛన్లు : ఎమ్మెల్యే నల్లారి


కలికిరిలో ప్రజలతో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 26: సామాజిక పింఛనుదారులందరికీ జూలై 1వ తేదీన ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బుధవారం పలు సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు నగరిపల్లెలో కిశోర్‌కుమార్ రెడ్డిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వున్న రూ.మూడు వేల పింఛను రూ.4 వేలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. పింఛను మొత్తం పెంచనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన నాటి నుంచి అంటే మూడు నెలల బకాయిలతో కలిపి జూలైలో రూ.7 వేల వంతున పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆ తరువాత యథాతథంగా ప్రతి నెలా రూ.4 వేల వంతున అందజేస్తామని తెలిపారు. విశ్వసనీయత గురించి మాట్లాడేవారు కేవలం రూ. మూడు వేలకు పింఛను పెంచడానికి ఐదేళ్ళు పట్టిందన్నారు. ఎన్నికల సమయంలో సచివాలయ ఉద్యోగులతో వృద్ధులకు ఇంటి వద్దే పింఛన్లు పంచే అవకాశమున్నా కేవల ఓట్ల రాజకీయం కోసం పండుటాకులను వేధించారని విమర్శించారు. స్థానికంగా సచివాలయాల్లో అవసరమైనంత మంది సిబ్బంది అందుబాటులో వున్నారని వారితోనే ఇంటి వద్ద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, అందుకు సీఎం చంద్రబాబు నాయుడు కసరత్తు చేస్తున్నారని వివరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన వారు వైసీపీ పాలనలో తాము ఎదుర్కొన్న వేధింపులను ఏకరువు పెట్టారు. కొంత మంది వలంటీర్లు కలిసి తమను కొనసాగించాలని కోరారు. పలు శాఖలకు చెందిన అధికారులు కూడా శాలువాలు కప్పి కిశోర్‌కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగుదేశం పార్టీ కోసం పని చేయండి


ములకల చెరువు: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దాసరిపల్లి జయచంద్రా రెడ్డి

ములకలచెరువు, జూన్ 26: వ్యక్తుల కోసం కాదు...పార్టీ కోసం...సైకిల్ గుర్తు కోసం పనిచేయండి....ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై దాడి జరిగిన తంబళ్లపల్లె గడ్డపై పార్టీలో ఉన్న కోవర్టులు వైసీపీ గెలుపు కోసం పనిచేశారు...చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాల్సిన సీటును వైసీపీతో కుమ్మక్కై చేజార్చారు. టీడీపీలో ఉండి వైసీపీ కోసం పనిచేసిన కోవర్టులను వదలనని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి హెచ్చరించారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై దాడి జరిగిన గడ్డపై కసితో పనిచేయాల్సిన కొందరు నాయకులు వైసీపీతో కలిసి టీడీపీ ని ఓడించారన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయ కర్త సీడు మల్లికార్జున నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, ఆనంద రెడ్డి, నారాయణ స్వామి రెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, రమణ, ప్రతాప్‌నాయుడు, ప్రసాద్ రెడ్డి, కేశవులు పాల్గొ న్నారు.

అనర్హులను గుర్తించండి: పింఛన్ల పంపిణీ సమయంలో అనర్హులు ఉంటే గుర్తించాలని జయచంద్రా రెడ్డి సూచించారు. ములకల చెరువులో బుధవారం పింఛన్ల పంపిణీపై మండల ప్రజాపరిషత్ కార్యాలయం అధికారులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జూలై నెల పింఛనును రూ.7వేలు ఇస్తున్నారన్నారు. వచ్చే నెలలో జరిగే పింఛను పంపిణీలో టీడీపీ శ్రేణులను భాగస్వాములు చేసుకుని అనర్హులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: పింఛన్ పంపిణీ పండుగలా జరగాలని టీడీపీ ఇనచార్జి జయచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని కురబలకోట ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో హరినారాయణ, తహసీల్దార్ ఈశ్వరమ్మ, నియోజకవర్గ పరిశీలకుడు మల్లికార్జున నాయుడు, కన్వీనర్ వై.జి.సురేంద్ర, మాజీ సర్పంచ్‌లు ప్రసాదరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి..

బి.కొత్తకోట: జయచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సాగర్, వినూయాదవ్ అనే వ్యక్తులు వ్యక్తిగతంగా, అవమానకరంగా పోస్టులు పెట్టి మానసికవేదనకు గురిచేస్తున్నారని ఆయన అనుచరులు బుధవారం సీఐ సూర్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరిద్దరితో పాటు ఫేక్ అకౌంట్లతో వ్యతిరేక పోస్టులు పెడుతున్న వారిని అదుపులోకి తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వేడుకగా నల్లసాని ఎల్లమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కలకడ, జూన్ 26: మండలంలోని నడిమిచెర్ల గ్రామదేవత నల్లసాని ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకవజాము వరకు చాందినీ బండ్లను ఊరేగించారు. మహిళలు కుటుంబ సమేతంగా బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమీపంలో గ్రామాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకున్నారు.

నేడు పెద్దమండ్యంలో జయచంద్రారెడ్డి పర్యటన

పెద్దమండ్యం, జూన్ 26: పెద్దమండ్యం మండలంలో తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి పర్యటిస్తారని మండల టీడీపీ సీనియర్ నాయకుడు చల్లపల్లె వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల అధికారులతో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కోరారు.

30న కలికిరికి మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 26: మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఆదివారం సాయంకాలం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. హైదరాబాదు నుంచి గురువారం బెంగుళూరు రానున్నారు. అక్కడ మూడు రోజులు బస చేసిన అనంతరం ఆదివారం సాయంకాల 6 గంటలకు మదనపల్లె మీదుగా కలికిరి చేరుకోనున్నారు. జూలై 1, 2, 3 తేదీల్లో బీజేపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ స్థానికంగా ఏర్పాటు చేసే వివిధ కార్యక్రమాలకు హాజరు కానున్నారు.

సీఎం చంద్రబాబును కలసిన శంకర్‌యాదవ్


సీఎం చంద్రబాబునాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్

మదనపల్లె/పెద్దతిప్పసముద్రం, జూన్ 26: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, యువనేత మనోజ్‌జయంత్ రెడ్డి బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలిశారు. కుప్పం పర్యటన ముగించుకుని తిరుగుప్రయాణంలో విజయవాడ వెళ్తున్న అధినేతను బెంగళూరులోని ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగోసారి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్‌ను మంగళగిరి రావాలని, అక్కడ మాట్లాడాలని చంద్రబాబునాయుడు సూచించారు.

పేదరిక నిర్మూలనే చంద్రబాబు లక్ష్యం


మాట్లాడుతున్న పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జూన్ 26: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అన్నారు. మండలంలోని కాలువపల్లెలో బుధవారం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కేశవులు, నాయకులు నాగరాజు, మస్తాన్, వెంకటరమణ, రవి, నాగసుబ్బు, కృష్ణమూర్తి, పెద్దమౌలాసాహెబ్, సదాశివరెడ్డి, ఫక్రుద్దీన్, మధు, శివన్న, ప్రతాప్‌నాయుడు, ఖాదర్‌బాషా, ఉమాశంకర్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు


ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న ఏడీఏ శివశంకర్

వాల్మీకిపురం, జూన్ 26: నకిలీ ఎరువులు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని మదనపల్లె ఏడీఏ శివశంకర్ హెచ్చరించారు. బుధవారం వాల్మీకిపురం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విక్రయాల సమయాన రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని, ఎలాంటి పొరపాటు జరిగినా దుకాణ యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏవో హేమలత, ఏఈవో రాజేష్, సిబ్బంది పాల్గొ న్నారు.

అలరించిన 'దుర్యోధన వధ'


దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

పీలేరు, జూన్ 26: పీలేరు ఆర్టీసీ బస్టాండు వద్ద జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో బుధవారం ప్రదర్శించిన దుర్యోధన వధ ఘట్టం అందరినీ అలరించింది. మహాభారత యుద్ధంలో చివరి అంకమైన భీమ, దుర్యోధన యుద్ధాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తూ ప్రజలను అలరించారు. దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలి వచ్చారు.

భువన విద్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రోగ్రాం

పీలేరు, జూన్ 26: తమ పాఠశాలలో ఈ ఏడాది నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రోగ్రాం అమలు చేయనున్నట్లు పీలేరులోని శ్రీ భువన విద్యాలయం పాఠశాల ప్రిన్సిపాల్ గుణలక్ష్మి తెలిపారు. పీలేరులో బుధవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రోగ్రాంలో శిక్షణ తీసుకున్న విద్యార్థుల్లో శారీరక, మానసిక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రోగ్రాంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు లభించే సర్టిఫికెట్లకు పదవ తరగతి తరువాత లభించే రిజర్వేషన్లలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉద్యోగ అవకాశాలూ మెండుగా ఉంటాయన్నారు. అనంతరం ఆమె విద్యార్థులకు విధివిధానాలు వివరించారు.

కోళ్లబైలు కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం

మదనపల్లె టౌన్, జూన్ 26: మండలంలోని కోళ్లబైలు పంచాయతీ వైఎస్ఆర్ కాలనీలో తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపినట్లు ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. రెండు రోజుల క్రితం వైఎస్సార్ కాల నీ ప్రజలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట తాగునీటి సమస్య పరిష్కా రం కోసం ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులు, పంచాయతీ కార్యదర్శు లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో కోళ్లబైలు-1 సర్పంచ్ ఆనందరెడ్డి, ఎంపీడీవో భానుప్రసాద్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ చందన, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. యుద్ధ ప్రాదిపతికన రాములవారిగుడి, మసీదు, వైఎస్ఆర్ కాలనీల్లోని మూడు బోర్ల మోటార్లను మరమ్మతులు చేయించడమే కాక, అదనపు పైపు లు దించారు. దీంతో పాటు వెలుగు స్కూలు వెనుక వైపు వున్న బోరుకు కొత్త మోటారు, పంపు బిగించి అక్కడి నుంచి ఓవర్ హెడ్ ట్యాంకుకు నీళ్లు సరఫరా చేసి, పబ్లిక్ కొళాయిలకు సరఫరా చేస్తున్నారు.

వైభవంగా తంబళ్లపల్లె తిరుణాల


విద్యుద్దీపాలంకరణలో గంగమ్మ ఆలయం

తంబళ్లపల్లె, జూన్ 26: తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని సంతోపలో బుధవారం గ్రామస్థులు కోటకొండ గంగమ్మ తిరుణాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల మహిళలు అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, తిరుణాలలో చాందిని బండ్లు కట్టేందుకు ఒక్కో బండికి రూ.30వేలు చొప్పున టీడీపీ నాయకుడు మలిగి మధుసూధన్‌రెడ్డి విరాళం అందచేశారు. తంబళ్లపల్లె, పరుసతోపు పంచాయతీల్లో కట్టిన 10 చాందినీ బండ్లకు ఒక్కోదానికి రూ.30 వేలు చొప్పున రూ.3 లక్షలను మలిగి అనుచరులు కుమార్‌నాయుడు, సుబ్రమణ్యం, ఆకులరెడ్డప్ప అందచేశారు.

సంత హక్కుల వేలంతో రూ.27.51 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

కురబలకోట, జూన్ 26: టమోటా, గొర్రెల సంత, వారపుసంత వేలంపాటల్లో అంగళ్లు పంచాయతీకి రూ.27.51 లక్షల ఆదాయం వచ్చింది. బుధవారం అంగళ్లు ఆర్‌బీకే కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఏడాది వేలం ఆలస్యమైంది. కాగా. ఈ ఏడాది గొర్రెల సంతద్వారా రూ.22.36 లక్షలు, వారం సంత ద్వారా రూ. 5.15 లక్షలు ఆదాయంరాగా, టమోటా మార్కెట్ వేలం వాయిదా పడింది. డీఎల్‌పీవో నాగరాజ, ఎంపీడీవో హరి నారాయణ, సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, కార్యదర్శి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థుల ఎంపిక

కురబలకోట, జూన్ 26: కాంచీ పురంలోని ఐఐఐటీడీఎమ్ ఇంటర్న్ షిప్‌కు ఏడుగురు విద్యార్థులు మి ట్స్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి. యువరాజ్ తెలిపారు. తమ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సం వత్సరం ఈసీఈ విభాగానికి చెం దిన ఈ విద్యార్థులు 45 రోజుల పాటు వీఎల్ఎస్ఐ ప్రాజెక్టులో పరిశోధనలు చేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్, అధ్యాపకులు అభినందించారు.

మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

మదనపల్లె అర్బన్, జూన్, 26:మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో సుమారుగా 40 మంది సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్నారు. మిగులు ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా గౌరవాధ్యక్షుడు టి. సుధాకర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, డివిజన్ కన్వీనర్ సుధాకర్, నాయకులు శీనప్ప, హరికృష్ణ, గాలి రవీంద్ర, సుబ్రహమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

బి.కొత్తకోట, జూన్26: మండలంలోని బడికాయలపల్లి సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసినట్టు సీఐ సూర్యనారాయణ తెలిపారు. పోలీసులను చూడగానే టాక్టర్‌ను వదిలిపెట్టి డ్రైవర్ పరారీ అయ్యాడని, అతనిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు